చేవెళ్ల ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, జూన్ 17 : చేవెళ్లలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం 17 కోట్లు మంజూరయ్యాయని, దీంతో ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం అందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. సోమవారం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ వార్డులో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరుగగా ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆస్పత్రిని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను, డయాలసిస్ వార్డులో కొనసాగుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయాలసిస్ సేవలు యథావిధిగా కొనసాగించాలని వైద్యులకు సూచించారు. డయాలసిస్ వార్డులోని గదిని వెంటనే బాగు చేసేలా కృషి చేస్తామన్నారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేసి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

కానిస్టేబుల్‌కు పరామర్శ

వికారాబాద్, జూన్ 17 : వికారాబాద్ శిక్షణా కేంద్రంలో విధులు నిర్వహిస్తూ భోజనానికి వచ్చి తిరిగి విధులకు వెళ్లే క్రమంలో ఏఆర్ కానిస్టేబుల్ కిషన్ ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డాడు. వికారాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఎస్పీ కోటిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున ఎల్లప్పుడూ తోడుంటామని ఎస్పీ భరోసా కల్పించారు. ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ డేవిడ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు.. జర పైలం..

సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరమంటున్న వైద్యులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 17 : వానలు కురుస్తున్నాయి.. వాతావరణ మార్పుల కారణంగా అనేక సమస్యలు చుట్టుముడతాయి. ఈ సమయంలో వ్యాధులు సంక్రమించనుండడంతో చాలా మంది ఇబ్బందులు పడే అవకాశముంది. సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఒక సీజన్ నుంచి మరో సీజన్‌లోకి ప్రవేశించే ముందు రకరకాల ఇన్‌ఫెక్షన్లు దాడి చేస్తాయి. వాతావరణం చల్లగా ఉండటంతో వైరస్‌లు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో ఈ సీజన్‌లో వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాల ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. ప్రతి పదిమందిలో నలుగురికి జలుబు, ఇద్దరికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా సోకుతాయి. తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 102 డిగ్రీల జ్వరం ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య రోగి నిస్సత్తువగా మారిపోతాడు. కొందరిలో ఒంటిపై దుద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. మరికొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వస్తుంటాయి. సాధారణంగా వీటిని విషజ్వరాలు అంటారు. వాటంతట అవే తగ్గిపోయే సాధారణ వైరల్ జ్వరాలు కూడా కొన్ని ఉన్నాయి. తప్పనిసరిగా చికిత్స తీసుకోవాల్సిన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటివి ఈ ఫీవర్ కిందకే వస్తాయి.

లక్షణాలు

ఒళ్లు నొప్పులు, జ్వరం, నీరసం, ఒంటిపై దుద్దుర్లు, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతు నొప్పి, ముక్కు కారడం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాల తీవ్రత తగ్గడానికి వ్యాధి నుంచి ఉపశమనం కలుగడానికి మాత్రమే మందులు ఉపకరిస్తాయి.

వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

* వైరల్ ఫీవర్ ఇన్‌ఫెక్షన్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది.
* ఆహారం షేర్ చేసుకోకపోవడం మంచిది.
* చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
* వానలో వెళ్తే గొడుగు, రెయిన్‌కోట్స్ తప్పనిసరిగా వాడాలి.
* కాచి, చల్లార్చిన నీటిని తాగాలి.
* ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి.
* పిల్లలకు పండ్లు ఎక్కువగా తినిపించాలి., నూనె పదార్థాలు ఎక్కువగా వాడొద్దు.
* వానలో తడిసినప్పుడు జలుబు, గొంతునొప్పిలాంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ప్రథమ చికిత్స

వైరల్ ఫీవర్‌కు సంబంధించిన లక్షణాలు రెండు, మూడు కనిపించిన రోగికి ఎక్కువగా నీళ్లు తాగించాలి. దీంతో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి. తాజా కొత్తిమీరతో చేసిన టీ, మెంతి వాటర్ తాగించాలి. దీంతో వైరస్ నాశనం అవుతుంది. పెద్దవాళ్లకైతే గంజి తాగించడం మంచి పద్ధతి. ఇది వైరస్‌ను ఎక్కువకాలం బతకనివ్వదు.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. వైద్యుల సలహాల మేరకే మందులు వాడాలి. దోమ తెరలను వినియోగించాలి. పూల కుండీలు, ఎయిర్‌కూలర్ల నీటి గొట్టాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చల్లటివి కాకుండా వేడి పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

- పూనం, వైద్యాధికారి దండుమైలారం

దండుమైలారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉన్న మందులు

పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుంది. రోగి బలహీనంగా మారి ఆహారం పూర్తిగా తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

వైరల్ ఫీవర్ రావడానికి కారణం

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు కూడా వైరల్ ఫీవర్స్ విజృంభిస్తాయి. చల్లదనం తీవ్రత పెరుగడంతో రక్త నాళాలు కుంచించుకుపోతాయి. దీంతో రక్త సరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో ఉండే తెల్ల రక్త కణాలు సంఖ్య క్రమంగా తగ్గడంతో శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు, పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందే అవకాశమున్నందున జాగ్రత్తగా చూసుకోవాలి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

నీరు నిలిచే ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయండి

టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్‌వర్క్స్, విద్యుత్, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అందరూ విధుల్లో ఉండాలని సూచించారు. తక్కువ సమయంలో ఒకేసారి భారీ వర్షాలు నమోదవుతున్నందున, 141 వాటర్ లాగింగ్ పాయింట్లలో ప్రత్యేక సిబ్బందిని ఉంచి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం అధికారులతో మంత్రి ప్రభాకర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెట్లు పడిన ప్రాంతాల్లో వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. సమస్య ఉన్న చోటును గుర్తించి అక్కడికి డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే చేరుకొని సహాయక చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మ్యాన్ హోళ్ల వద్ద ప్రమాదం జరగకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు.

'గ్రేట్ ప్లేస్ టు వర్క్'

ఎల్ అండ్ టీ మెట్రోకు గుర్తింపు

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ సంస్థకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు దక్కింది. పనిచేసే చోట సంస్కృతికి సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ ప్రాధికార సంస్థ 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా' ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును ప్రకటించింది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఈ సర్టిఫికేషన్ గుర్తింపు అమల్లో ఉంటుందని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పనిచేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారమైన పరిస్థితులను కల్పించడంలో ఎల్ అండ్ టీ మెట్రో ఎంతో నిబద్ధతకు గుర్తింపుగా ఈ సర్టిఫికేషన్ లభించిందన్నారు.

గచ్చిబౌలి కిడ్నాప్ కేసులో మరో నిందితుడి అరెస్టు

శేరిలింగంపల్లి, జూన్ 17 : ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో వరుసకు బావను బావమరిది కిడ్నాప్ చేసిన ఘటనలో మరో నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితులైన గౌతం, అశోక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ కేసులో మరో నిందితుడు నరేశ్‌ను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను సైతం పట్టుకునేందుకు ముమ్మురంగా గాలిస్తున్నారు.

కర్రపూజ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

70 అడుగుల మట్టి గణపతి

ఖైరతాబాద్ గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 70 ఏండ్లు

అన్ని అడుగుల్లోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం
నేత్రపర్వంగా కర్రపూజ..
సంయుక్తంగా ఉత్సవాల నిర్వహణకు సభ్యులు ఒకే
త్వరలోనే నూతన కమిటీ ఏర్పాటు: ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, జూన్ 17 : ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం ఈ ఏడాది 70 అడుగుల్లో రూపుదిద్దుకోనున్నది. ఈ నేపథ్యంలో నిర్జల ఏకాదశి తిథిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం కర్రపూజ మహోత్సవాన్ని వినాయక విగ్రహ ఏర్పాటు మండపం వద్ద వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్ వేడుకలను ప్రారంభించారు. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తైన మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకటించారు. త్వరలోనే నమూనా విడుదల చేస్తామన్నారు. వినాయక చవితికి వారం రోజుల ముందే స్వామివారి విగ్రహం సిద్ధమవుతుందన్నారు. కర్ర పూజలో పాటు గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన తామే నిర్వహిస్తామంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీలు వేర్వేరుగా ప్రకటించాయి. దీంతో సభ్యుల మధ్య కొత్త వివాదానికి తెరలేపింది. అయితే సోమవారం జరిగిన కర్రపూజ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇరు వర్గాలతో చర్చించి.. సభ్యులందరూ సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు సభ్యులందరూ అంగీకరించగా, ఎలాంటి గొడవకు తావు లేకుండా కర్రపూజ సజావుగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ్ నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. ప్రస్తుతం అడ్‌హక్ కమిటీగా కార్యక్రమాలను నిర్వహిస్తామని, రెండు మూడు రోజుల్లో సభ్యులందరితో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సారి గణపతిని దర్శించుకునేందుకు వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

70 అడుగుల విగ్రహం

ఖైరతాబాద్ గణేశుడికి 70 ఏండ్ల చరిత్ర ఉన్నది. 1954లో ఒక్క అడుగుతో ప్రారంభించి.. సుమారు 60 అడుగులకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టగా, గణేశుడిని 70 అడుగుల్లో ప్రతిష్ఠించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఖైరతాబాద్ గణేశుడి చరిత్రలో మొదటిసారిగా 70 అడుగుల విగ్రహానికి అంకురార్పణ జరిగింది. పీవోపీ వినియోగించకుండా పూర్తిగా మట్టితో తయారు చేసిన ప్రతిమను ప్రతిష్ఠిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు, కోశాధికారి శశిధర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సింగరి రాజ్ కుమార్, సందీప్ రాజ్, మహేశ్ యాదవ్, మహేందర్ బాబు, కృష్ణయాదవ్, మధుకర్ యాదవ్, వి.ప్రవీణ్, పృథ్వీరాజ్, నాగేశ్, రాందెడ్డి, భాస్కర్ అశోక్, రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో 9 మంది బైక్ రేసర్ల అరెస్టు

శేరిలింగంపల్లి, జూన్ 17 : అర్ధరాత్రి రహదారులపై బైక్ రేసింగ్‌కు పాల్పడుతూ.. భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న తొమ్మిది మందిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి నాలెడ్జి సిటీ టీ హబ్ ప్రాంతంలోని రహదారుల్లో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ మొబైల్స్, పోలీసు సిబ్బంది బైక్ రేసర్లను పట్టుకునేందుకు వెళ్లారు. బైక్‌లతో స్టంట్స్ చేస్తూ.. ఇష్టం వచ్చినట్లు కేకలు వేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకి సైతం దూసుకొచ్చారు. తప్పించుకున్న పోలీసులు.. రేసర్లను అడ్డుకునేందుకు స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో కొందరు రేసర్లు పరారు కాగా.. మరికొందరు వాహనాలను వదిలి తప్పించుకొని పారిపోయారు. వాహనాల ఆధారంగా సోమవారం తొమ్మిది మంది నిందితులను రాయదుర్గం పోలీసులు గుర్తించి, అరెస్టు చేశారు.

నేటి నుంచి ఎమర్జెన్సీ పంపింగ్

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : ఎత్తిపోతల ద్వారా నగరానికి గోదావరి జలాల తరలింపు ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభం కానున్నది. బుధవారం నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి అత్యవసర పంపింగ్‌తో నగరానికి రోజూ 168 ఎంజీడీలను తరలించనున్నారు. ఈ మేరకు ఏడు పంపులను అధికారులు సిద్ధం చేసి ట్రయల్ రన్ పూర్తి చేశారు. సోమవారం రోజు అన్ని పంపులను ఆన్‌చేసి సాధ్యసాధ్యాలను పరిశీలించిన అధికారులు.. బుధవారం నుంచి పూర్తి స్థాయిలో ఎమర్జెన్సీ పంపింగ్‌కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గోదావరి జలాల తరలింపులో భాగంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ నీటి నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా.. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లిలోకి వరద నీరు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో నీటి నిల్వలు 4.5 టీఎంసీల మేర ఉండగా.. ముందస్తుగానే అప్రమత్తమైన జలమండలి అధికారులు.. ఎల్లంపల్లి రిజర్వాయర్ బ్యాక్ చానల్ ముర్మూర్ ఫోర్‌సోర్ వద్ద అత్యవసర పంపింగ్ మోటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో పంపు నుంచి 25 క్యూసెక్కుల మేర తొలుత ఎత్తిపోసి.. గోదావరి జలాలను అందించి తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు తగ్గిన కొద్దీ మరిన్ని పంపులను ఏర్పాటు చేసే అవకాశమున్నదని, అయితే ఎల్లంపల్లిలోకి వరద కొద్ది రోజుల్లోనే ప్రారంభమవుతుందన్న ఆశాభావంలో అధికారులు ఉన్నారు. మొత్తంగా గోదావరి జలాల తరలింపు ప్రక్రియలో 2016లో ఒక్కసారి మాత్రమే ఎల్లంపల్లి నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించిన సందర్భాలు ఉన్నాయి.

సోమవారం వర్షం కురువడంతో మొయినాబాద్‌లోని ఏ-వన్ మోటర్స్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిలిచిన వరద నీరు

పాట్లు పడుతున్నా.. పట్టించుకోరా..?

- వర్షం పడితే చాలు ఏరులను తలపిస్తున్న రోడ్లు
- మొయినాబాద్‌లోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిలుస్తున్న నీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు, వాహనదారులు

మొయినాబాద్, జూన్ 17 : వర్షం పడితే చాలు రోడ్లు ఏరులను తలపిస్తున్నాయి. గతంలో ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చేది. రోడ్డుకు దిగువ ప్రాంతంలో భూయాజమాని వరద కాలువను కబ్జా చేసి ప్రహరీ నిర్మించాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా నీళ్లు నిలుస్తున్నాయి. వరద నీరు ఎటూ వెళ్లడానికి మార్గం లేకపోవడంతో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిలుస్తున్నాయి. గతంలో ఓపెన్ మురుగు కాలువ ఉన్నప్పుడు వర్షపు నీరు మురుగు కాలువ వెంబడి వెళ్లేది. కానీ ప్రస్తుతం అంతర్గత మురుగు కాలువ నిర్మించడంతో.. దానిపై దుకాణాలను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం సీసీతో రోడ్డు మాదిరిగా వేయడం లేదా సీసీతో బెడ్ వేసి చిరు వ్యాపారుల దుకాణాలను షెటర్ల ముందు ఏర్పాటు చేయించడంతో వరద నీరు ఎటూ వెళ్లడానికి వీలులేక పోతున్నది. సోమవారం జరిగే సంతలోని చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కురిసిన వానకు మొయినాబాద్‌లో రోడ్లు కాలువలను తలపించాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సమస్యను అధికారులు, పాలకులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శంకర్‌పల్లిలో కురుస్తున్న వర్షం

డ్రగ్స్ దందాపై టీనాబ్ నిఘా

- 12 మందికి మూత్ర పరీక్షలు
- డీజేతోపాటు మరో ఇద్దరికి పాజిటివ్.. కేసు నమోదు
- డ్రగ్స్‌పై సమాచారమివ్వండి



సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ క్రయ విక్రయాలపై తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో (టీనాబ్) పెట్టిన నిఘాలో ఒక డీజేతో పాటు 16 మంది పట్టుబడ్డారు. వారికి మూత్ర పరీక్షలు నిర్వహించడంతో డీజేతో పాటు మరో ఇద్దరు కొకైన్, గంజాయి సేవించినట్లు తేలింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. సైబరాబాద్ పరిధిలోని పబ్‌లపై నిఘా పెట్టడంతో ఒక డీజే మాదాపూర్, గచ్చిబౌలిలోని పబ్‌లలో డ్రగ్స్ తీసుకుంటున్నట్లు గుర్తించారు. దీంతో డీజే కదలికలను ట్రాక్ చేయడంతో 16 మందితో డ్రగ్స్ సంబంధాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇందులో 12 మందికి మూత్ర పరీక్షలు నిర్వహించడంతో.. డీజేతో సహా ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో ఎన్డీపీఎస్ చట్టం కింద వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు టీనాబ్ డైరెక్టర్ వెల్లడించారు. డ్రగ్స్‌ను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న డ్రగ్ నిరోధక కమిటీలకు (ఏడీసీఎస్) అనుమానం వస్తే స్థానిక పోలీసులకు, యాంటీ నార్కోటిక్ బ్యూరోకు సమాచారమివ్వాలని సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బ్యాగులు, లాకర్లలో ఈ సెగరెట్లు, వేప్‌లు, మద్యం సీసాలు, గంజాయి చాక్లెట్లు, సిగరెట్లు.. ఇలా అన్నింటినీ తనిఖీ చేయాలని సూచించారు. జూనియర్ విద్యార్థులను బెదిరించి సీనియర్లు డ్రగ్స్, సిగరెట్లను స్మగ్లింగ్ చేయడానికి ఉపయోగిస్తారని, విద్యార్థులైతే వారి వివరాలు బయటకు చెప్పమని తెలిపారు. ఏదైనా సమాచారముంటే టీజీఏఎన్‌బీ కంట్రోల్ రూమ్ (8716271111)కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హాస్టళ్లల్లోనూ అపరిశుభ్రతే!

నిబంధనలు పాటించని వారిపై ఫుడ్ సేఫ్టీ చర్యలు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రుచికి, శుభ్రతకు పెట్టింది పేరు అంటూ ఊదరగొట్టే పెద్ద పెద్ద పేరు మోసిన హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో బండారాలు బయటపడుతున్నాయి. కుళ్లిపోయిన మాంసం, ఎక్స్‌పైరీ డేట్ దాటిన ప్రొడక్ట్, కల్తీ మసాలాలు, ఏ మాత్రం నాణ్యత లేని పదార్థాలను వాడటమే కాకుండా.. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేస్తున్నట్లు తనిఖీల్లో అధికారులు గుర్తించారు. తాజాగా, హాస్టళ్లలోనూ ఫుడ్ సేఫ్టీ రూల్స్ కూడా సరిగా పాటించడం లేదని అధికారులు వెల్లడించారు. మాదాపూర్‌లో శ్రీలక్ష్మీ పీజీ హాస్టల్, వీజీ హోం స్టే హాస్టల్‌లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు తేలింది. ముఖ్యంగా ఆహారంలో రంగుల వాడకం, దోస తవ్వతుప్పు పట్టినట్లు పరిశీలించారు. కూరగాయలు అపరిశుభ్రంగా ఉండటం, పనిచేసే కార్మికులు నెత్తిన ఎలాంటి క్యాప్ ధరించలేదని, వంటల్లో వాడే కారం పొడి కల్తీ జరిగినట్లు గుర్తించారు. నారాయణ మెడికల్ అకాడమీలో ఫుడ్ లైసెన్స్ లేకపోవడం, అపరిశుభ్రత వాతావరణంలో తాగునీటి సౌకర్యం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, వంటగదిలో అపరిశుభ్రత ఉన్నట్లు గుర్తించి.. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు.